క్లుప్తంగా

వ్యాక్సినేషన్ పరిశీలన



లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల సబ్‌సెంటర్‌లో శనివారం డీఎంహెచ్‌ఓ మల్లికార్జున్‌రావు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఏఎన్‌ఎం, ఆశ వర్కర్ల పనితీరును తెలుసుకున్నారు. వ్యాక్సినేషన్ పట్ల నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ఏఎన్‌ఎం సంపూర్ణ, ఆశ వర్కర్లు ఉన్నారు.

డీసీసీ అధ్యక్షుడిని కలిసిన గ్రంథాలయ సంస్థ చైర్మన్



రఘునాథపల్లి: జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని శనివారం గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలో కొమ్మూరికి శాలువా, బొకే అందజేశారు. ఈ నెల 28న జరిగే తన ప్రమాణస్వీకార మహోత్సవానికి హాజరు కావాలని కోరారు. జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ శివరాజ్‌యాదవ్, లోనె శ్రవణ్‌కుమార్ ఉన్నారు.

పరామర్శ

బచ్చన్నపేట: మండలంలోని కట్కూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన బాధిత కుటుంబాలను డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి శనివారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దూసరి సాయిబాబా, ఏనుగుల కర్ణాకర్ కుటుంబాలను, అలాగే బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందిన మూసిని శ్రీనివాస్ కుటుంబాలను పరామర్శించారు. అలాగే ఇటీవల హార్ట్ సర్జరీలు చేసుకున్న గడిపె సిద్దినర్సయ్య, తమ్మడి శంకరయ్యలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు చేర్యాల మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత వెంకటాచారీ ఒక్కొక్కరికి రూ. 5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. నూకల బాల్‌రెడ్డి, కామిడి జీవన్‌రెడ్డి, శ్రీనివాస్, నర్సింహులు, పర్షయ్య, బాల్‌రాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కొడకండ్ల: పెద్దబాయితండకు చెందిన సొసైటీ డైరెక్టర్ వాంకుడోత్ పూల్‌సింగ్‌నాయక్ భార్య సత్తమ్మ శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. పూల్‌సింగ్‌నాయక్ తన భార్యను శుక్రవారం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించి రాత్రి ఇంటికి బయలుదేరారు. గిర్నితండా వద్ద బస్సు దిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా వైన్స్ ఎదురుగా రోడ్డుపై ఆగి ఉన్న ట్రాక్టర్ ఢీకొనడంతో కిందపడిపోయారు. పూల్‌సింగ్ నాయక్‌కు స్వల్ప గాయాలు కాగా సత్తమ్మ తలకు తీవ్ర గాయమవడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్, పాలకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్‌నాయక్‌లు సత్తమ్మ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

కారును ఢీకొట్టిన లారీ.. ఐదుగురికి గాయాలు

రఘునాథపల్లి: హనుమకొండ–హైదరాబాద్ జాతీయ రహదారిలో కారును ఓ లారీ ఢీకొట్టిన సంఘటనలో ఐదుగురికి గాయాలైన సంఘటన శనివారం తెల్లవారుజామున రఘునాథపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పరకాలకు చెందిన బండారి గిరిప్రసాద్ తన స్నేహితులతో కలిసి పనుల నిమిత్తం కారులో హైదరాబాద్ వెళ్లి తిరిగి వస్తున్నారు. రఘునాథపల్లిలోని అక్షయ హోటల్ వద్దకు రాగానే వెనుకాల వచ్చిన లారీ ఓవర్ టేక్ చేస్తుండగా పక్కన మరో కారు రావడంతో గిరిప్రసాద్ కారును ఢీ కొట్టింది. అంతే కాకుండా 50 మీటర్ల వరకు కారును ఈడ్చుకుంటా తీసుకెళ్లింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న గిరిప్రసాద్, పంతగాని కిషోర్, బుర్ర కిరణ్, కోతుల వర్దన్, కోతుల క్రాంతిలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను జనగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గిరిప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేష్ తెలిపారు.

బియ్యం అందజేత



పాలకుర్తి టౌన్: మండలంలోని ఈరవెన్ను గ్రామానికి చెందిన సట్ల ఉప్పలయ్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబానికి ఆత్మీయ స్వచ్ఛంద సేవా సంస్థ, 50కేజీల బియ్యం, మహాత్మా హెల్పింగ్ హాండ్స్ క్వింటా, బియ్యం, డాక్టర్ చుక్కా రామయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో 25 కేజీల బియ్యం శనివారం అందజేశారు. అదే విధంగా పాలకుర్తి మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన కన్నబోయిన రమేష్ కుటుంబానికి సీనియర్ కాంగ్రెస్‌నాయకుడు ఎడవెల్లి సోమ మల్లయ్య 50 కేజీల బియ్యం అందజేశారు.

కనువిందు చేస్తున్న ‘ఖిల్లా’

- పురాతన కోట కట్టడాలు, ఆలయాలు, ఎత్తైన కొండలు
- సందర్శకులను ఆకర్షిస్తున్న చారిత్రక ప్రాంతం



బురుజుపై ఏర్పాటు చేసిన ఫిరంగి


జఫర్‌గఢ్: జిల్లా కేంద్రానికి సుమారు 48 కిలోమీటర్ల దూరంలో ఉన్న చారిత్రాత్మక జఫర్‌గఢ్ కోట (ఖిల్లా) కట్టడాలు, పురాతన ఆలయాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. వీటికి తోడు పడమర కొండపై వెలసిన లక్ష్మీనర్సింహస్వామి ఆలయం సైతం భక్తులకు కొంగుబంగారంగా నిలుస్తోంది. జఫర్‌గఢ్‌ను కాకతీయుల కాలానికి ముందే ఈ ప్రాంతాన్ని వేల్పులు పరిపాలించినట్లు చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఇప్పటికీ ఈ ప్రాంతాన్ని వేల్పుగొండ అని షఫర్ అని పిలుస్తుంటురు. వేల్పుల కాలంలో పడమర కొండ వెనుక భాగంలో పూర్వం వేల్పుగొండ గ్రామం ఉండేది. ఇప్పటికీ ఈ ప్రాంతంలో గ్రామం లేకున్నా జఫర్‌గఢ్ వాసులు పాతూరుగా పిలుస్తుంటారు. ఈ ప్రదేశంలో వేల్పులు నిర్మించిన విష్ణు ఆలయం, శివాలయం, అతి ఎత్తైన ఏకశిల స్తంభం, మసీదులు ఇప్పటికీ ఉన్నాయి. కాగా ఇవి ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నాయి. కాలక్రమేనా ఈ ప్రాంతం నిజాం పాలన కాలంలో జఫర్‌ద్దౌలా అధీనంలోకి వెళ్లింది. ఇతడు రెండు ఎత్తైన కొండల మధ్య విశాలమైన ఖాళీ ప్రదేశాన్ని చూసి ముగ్ధుడై తనకు అనువైన విధంగా గ్రామాన్ని నిర్మించి వేల్పుగొండ ప్రజలను ఇక్కడికి తరలించారు. ఇతని కాలంలో పడమర కొండపైన లక్క మేడలు, ఏనుగులు, గుర్రాల దర్వాలను నిర్మించాడు. అదే విధంగా గ్రామం చుట్టూతా రెండు కొండలను కలుపుతూ విశాలమైన కందకాలను తవ్వి మట్టితో ఎత్తైన కట్టాలను నిర్మించాడు. వీటిపై మధ్యమధ్యలో ఎత్తైన బురుజులను (బతారాలు) నిర్మించి వాటిపై మర ఫిరంగులను ఏర్పాటు చేశాడు. బయటి ప్రదేశం నుంచి శత్రువులు గ్రామం లోపలికి రాకుండా ఉండేందుకు మూడు చోట్ల అతి ఎత్తైన దర్వాజలను నిర్మించాడు. ఈ ముఖ దర్వాజలకు హనుమకొండ, ఖమ్మం, పట్నం పేరు పెట్టాడు. ఇప్పటికీ ప్రజలు వీటిని ఈ పేర్లతోనే పిలుస్తుంటారు. జఫర్‌ద్దౌలా స్వయంగా నిర్మించిన బతారాలపైకి ఫిరంగులను తరలించి సైన్యం కాపలాతో గ్రామాన్ని నిరంతరం శత్రువుల దాడుల నుంచి కాపాడుకునే వాడు. ఈ బతారాలపై నుంచి చూస్తే సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న శత్రువుల రాకను పసిగట్ట వచ్చు. ఇంత శత్రు దుర్భేద్యమైన గ్రామం మరెక్కడ లేదనడంలో అతిశయోక్తి లేదు. పడమర గుట్టపై లక్కమేడల పేరుతో భవనాన్ని నిర్మించి పరిపాలనను కొనసాగించాడు. చారిత్రక కట్టడాలతో పాటు సహజ సిద్ధంగా వెలసిన రాతి గుహలు ఈ ప్రాంతంలో కోకొల్లలుగా ఉన్నాయి.

పర్యాటకులకు స్వర్గధామం

చారిత్రక ప్రాంతమైన జఫర్‌గఢ్ కోట గొడలను తిలకించేందుకు పర్యాటకులు వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తుంటారు. పడమర గుట్టపైకి ఎక్కి చూస్తే అద్భుతమైన మనోహరమైన దృశ్యాలు కనువిందు చేస్తుంటాయి. ఒకవైపు రెండు ఎత్తైన కొండలు, పడమర కొండపై లక్ష్మీనర్సింహస్వామి ఆలయంతో పాటు పెద్ద కోనేరులు, పురాతన కోట కట్టడ్డాలు, ఫిరంగులు, దర్వాజలు, పచ్చటిచెట్లు దర్శనమిస్తుంటాయి. చాలామంది ఔత్సాహికులు ఈ ప్రాంతం గురించి తెలుసుకుని సినిమా షూటింగ్‌లతో పాటు షాట్ ఫిలింమ్‌లు తీస్తుంటారు. కాగా, గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో సీసీ రోడ్లు మినహా కొండపైకి భక్తులు వెళ్లేందుకు రోడ్డు మార్గం, విశ్రాంతి భవనాలు తదితర టూరిజం అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. వాటిని చేపట్టినట్లయితే ఈ ప్రాంతం మరింతగా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని స్థానికులు కోరుతున్నారు.



హనుమకొండ దర్వాజ



వేల్పుగొండపై ఉన్న లక్ష్మీనర్సింహస్వామి ఆలయం

గురుకుల విద్యాలయం తనిఖీ



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ రాములు

పాలకుర్తి: గూడూరులోని తెలంగాణ గిరిజన (బాలికల) గురుకుల విద్యాలయాన్ని ఎంపీడీఓ రాములు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తనిఖీ చేసినట్లుగా ఆయన తెలిపారు. విద్యాలయంలో పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల ఆరోగ్యం, వంట గది సిబ్బంది పనితీరు, స్టోర్ రూంను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ రేణుకతో కలిసి తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు.

బీసీ హాస్టల్ సందర్శించిన తహల్దార్

దేవరుప్పుల: మండలంలోని చిన్నమడూర్‌లోని బీసీ హాస్టల్‌ను తహసీల్దార్ ఎం.మహిపాల్‌రెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, పరిసరాలను పరిశీలించి హాస్టల్‌లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందుల తలెత్తకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఆర్‌ఐ రాజు, ఆంద్రయ్య, తదితరులు ఉన్నారు.

రాజ్యాధికారమే లక్ష్యంగా..

- సేవాలాల్ సేనా కేంద్ర కమిటీ చైర్మన్ ప్రేమ్‌చంద్, జాతీయ అధ్యక్షుడు చిన్నబాబు



మొక్కులు చెల్లిస్తున్న ప్రేమ్‌చంద్, చిన్నబాబు

తరిగొప్పుల: రాజ్యాధికారమే లక్ష్యంగా గిరిజన బిడ్డలు ముందుకు సాగాలని, కొట్లాడే తత్వం మన లంబాడీ జాతిలో ఆనాటి నుంచి నరనరాన ఉందని సేవాలాల్ సేనా కేంద్ర కమిటీ చైర్మన్ ధరావత్ ప్రేమ్‌చంద్, జాతీయ అధ్యక్షుడు భూక్య చిన్నబాబు నాయక్ అన్నారు. సేవాలాల్ సేనా తరిగొప్పుల మండల కమిటీ ప్రమాణస్వీకారం, సన్మానం మహోత్సవాన్ని శనివారం మండలంలోని జాలుబాయితండా శివారు అమర్‌గడ్ ప్రాంగణంలో నిర్వహించగా వారు పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు సేవాలాల్ మహారాజ్, జ్వాలాముఖి అమ్మవారి ప్రత్యేక పూజలు చేశారు. అతి పురాతన జాతి ఏదైనా ఉందంటే అది గిరిజన జాతియే అని కొనియాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సభావత్ అల్పతి నాయక్, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్లావత్ లక్ష్మణ్, బానోత్ మహేందర్, ధరావత్ శంకర్ నాయక్, భూక్య జుంలాల్ నాయక్, తెజావత్ మోహన్, రమేశ్, అనిల్ చౌహాన్, అజ్మీరా కిషన్, ప్రవీణ్‌కుమార్, రమేశ్ నాయక్, సభావత్ రాజు, భూక్య రవి పాల్గొన్నారు.

చిల్పూరు ఆలయ కమిటీ చైర్మన్‌గా శ్రీధర్‌రావు



శ్రీధర్‌రావు

చిల్పూరు: ఎట్టకేలకు చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ ఎంపిక అయింది. చైర్మన్‌గా పొట్లపల్లి శ్రీధర్‌రావు (పల్లగుట్ట), ఆలయ ప్రధాన అర్చకుడిగా బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ (చిల్పూరు), ధర్మకర్తలుగా తాళ్లపల్లి బుచ్చయ్య (చిన్నపెండ్యాల), పుల్యాల నారాయణరెడ్డి (మల్కాపూర్), ఎనగందుల రత్నాకర్‌రెడ్డి (పల్లగుట్ట), చల్ల వెంకటరమణాదేవి(వెంకటాద్రిపేట), గోలి రాజశేఖర్‌గుప్త(శివునిపల్లి), గనగోని రమేష్ (చిల్పూరు), భూక్య శ్రీనివాస్ (దేశాయితండ), వేముల వెంకటేశ్వర్లు (కష్టాజీగూడెం), పులికాశి రాజయ్య(కొండాపూర్) మోతె మహేష్(శ్రీపతిపల్లి) కొలిపాక రాజు(చిల్పూరుగుట్ట) ఎడమ అశోక్ (తాటికొండ) చెట్కూరి రవి (స్టేషన్‌ఘన్‌పూర్)లు ఎంపికయ్యారు. 25వ తేదీ సోమవారం ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆధ్వర్యంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేయనుంది.

వైభవంగా లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు



చిల్పూరు: కల్యాణంలో పాల్గొన్న భక్తులు



జఫర్‌గఢ్: హోమంలో పాల్గొన్న భక్తులు

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో వేల్పుగొండ కొండ దిగువన ఉన్న లక్ష్మీనర్సింహ సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజు శనివారం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు వెంకటాచార్యులు, శ్రీనివాసచార్యులు, కృష్ణమచార్యుల, భక్తులు పాల్గొన్నారు. కాగా ఆదివారం లక్ష్మీనర్సింహస్వామి కల్యాణమహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వారకల్యాణం

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ వైభవంగా వారకల్యాణం నిర్వహించారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో పలువురు దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. పొట్లపల్లి శ్రీధర్ రావు–కిరణ్మయి, సంగోజు మోహనాచారి–శంకరలక్ష్మి, గుళ్లపల్లి శ్రీనివాస్–భవాని, జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, వీరన్న, మల్లికార్జున్, లక్ష్మి, వసంత, స్వరూప, కృష్ణ, మహేష్, హరిశంకర్,రాజేష్, విశాల్, శేఖర్, అజయ్, రాములు పాల్గొన్నారు.

‘అదానీ’ని అరెస్టు చేసి దేశ ప్రతిష్టను కాపాడాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి



జెండా ఆవిష్కరణలో కనకారెడ్డి, నాయకులు

పాలకుర్తి: గౌతం అదానీపై అమెరికాలో కేసు నమోదు చేయడంతో దేశ ప్రతిష్టకు భంగం వాటిల్లిందని, వెంటనే కేంద్ర ప్రభుత్వం అతడిని అరెస్టు చేసి దేశ ప్రతిష్టను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం పాలకుర్తి మండలం ఈరవెన్ను గ్రామంలో సీపీఎం గ్రామ సభను ఏదునూరి మదార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను కనకారెడ్డి ఆవిష్కరిచి మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగారపు రమేశ్, చిట్యాల సోమన్న, ఎండీ షబానా, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, సోమ సత్యం, మాసంపల్లి నాగయ్య, బెల్లి సంపత్, పనికిరాని రాజు, నాయని శ్రీను పాల్గొన్నారు. కాగా, సభలో పార్టీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఏదునూరి మదార్, సహాయ కార్యదర్శిగా జక్కుల రాజుతో పాటు, కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

చర్య తీసుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రఘునాథపల్లి: నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల యజమాన్యాలపై చర్య తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి పాదల లవకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండలంలోని అశ్వరావుపల్లి ఉన్నత పాఠశాలలో ఎంఈఓ రఘుందన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. నాయకులు అక్షిత్, రమేష్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు



జనగామ: బాణసంచా పేల్చుతున్న నాయకులు



చిల్పూరులో..

జనగామ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘనవిజయం సాధించడాన్ని స్వాగతిస్తూ శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ చౌరస్తాలో ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున సంబురాలు నిర్వహించాయి. బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మ గాని అనిల్‌గౌడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవీఎల్‌ఎన్‌రెడ్డి, ఉడుగుల రమేశ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త, శివరాజ్ యాదవ్ బాణసంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. వారి వెంట అశోక్, చంద్రయ్య, కార్తీక్, క్రాంతి, ముక్క సామి, భాస్కర్, సముద్రాల సందీప్, చందు, తదిరులు ఉన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, పాలకుర్తిల్లో..

స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు/పాలకుర్తి టౌన్: మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీతో గెలువడంతో స్టేషన్‌ఘన్‌పూర్, చిల్పూరు, పాలకుర్తి మండలాల్లో బీజేపీ నాయకులు బాణసంచా పేల్చి సంబురాలు చేసుకున్నారు. పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, బాల్నె శ్రీనివాస్‌గౌడ్, గంటె ఉపేందర్‌యాదవ్, తోట శ్రీనివాస్, ప్రదీప్, శ్రీనివాస్, బూర్ల విష్ణు, దొంగరి మహేందర్, చౌడ రమేష్, నిరంజన్, దుంపల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

నీతివంతమైన పాలనకు పట్టం..

జనగామ: మహారాష్ట్రతో పాటు దేశంలో జరిగిన వివిధ రాష్ట్రాల ఉప ఎన్నికల్లో బీజేపీ నే తృత్వంలోని నీతివంతమైన ఎన్డీఏ కూటమికి ప్రజలు అఖండ మెజార్టీతో నరేంద్ర మోదీ సుపరిపాలనకు బహుమానం ఇచ్చారని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ వారంటీ లేని గ్యారంటీలతో గ్యారడీ విద్య చేస్తున్న కాంగ్రెస్ పార్టీని ఓటర్లు ఇంటికి పంపించారన్నారు. మోదీ నాయకత్వంలో ప్రపంచంలోనే శక్తివంతమైన భారతావని ఆవిష్కరిస్తుందనే నమ్మకాన్ని దేశ ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు.

రానున్నది కాషాయ రాజ్యమే..

బచ్చన్నపేట: రానున్న రోజుల్లో రాష్ట్రంలో కాషాయ రాజ్యం రానున్నదని బీజేపీ మండల అధ్యక్షుడు చిమ్ముల నరేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ అత్యధిక సీట్లు గెలుపొంది అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో త్వరలోనే ఎన్నికలు రావడం ఖాయమన్నారు.

సభను జయప్రదం చేయండి

జనగామ రూరల్: ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీ తెలంగాణ భవన్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే వారోత్సవాల సభను జయప్రదం చేయాలని సమితి జాతీయ అధ్యక్షుడు జెరిపోతుల పరశురామ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వారోత్సవాల వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో గట్టగల సంజీవ, తిప్పరపు ప్రసాద్, తాళ్లపెల్లి ఎల్లేష్, బొట్ల నగేశ్, మబ్బు కర్ణాకర్, పల్లపు ఎల్లేష్ , పగిడిపాటి శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

ధ్రువపత్రాలతోపాటు హెల్మెట్ తప్పనిసరి

- ఏసీపీ భీమ్‌శర్మ



మాట్లాడుతున్న ఏసీపీ భీమ్‌శర్మ

లింగాలఘణపురం: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ సరైన ధ్రువపత్రాలను కలిగి ఉండడమే కాకుండా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఏసీపీ భీమ్‌శర్మ అన్నారు. శనివారం రాత్రి మండలంలోని నెల్లుట్లలో కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ యువతను ఉద్దేశించి ఏసీపీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో అతివేగం పనికి రాదని సూచించారు. అంతేకాకుండా గ్రామాల్లో రైతులు ధాన్యం విక్రయించిన అనంతరం వచ్చిన డబ్బులపై అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల బారిన పడవద్దని సూచించారు. ఈ సందర్భంగా ప్రతి ఇల్లు సోదాతో పాటు వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై శ్రావణ్‌కుమార్‌తో పాటు స్టేషన్‌ఘన్‌పూర్ ఎస్సై రమేష్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

దేవరుప్పుల: ప్రైవేట్ పాఠశాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసగాని సుమ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. లవకుమార్, రమేష్, యాకన్న, రాథోడ్, కీర్తన, ఆర్య, శ్రీనాథ్, రాజేష్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన వైద్య విద్యార్థులు

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జనగామ మెడికల్ కళాశాల ప్రథమ సంవత్సర విద్యార్థులు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పావని ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా పావని విద్యార్థులకు పీహెచ్‌సీలో నిర్వహించే నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్‌పై వివరించారు. స్థానిక వైద్యాధికారి రవితేజ, డాక్టర్ కిరణ్, ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఉన్నారు.

స్కూల్ బస్సులను సీజ్ చేయాలి

జనగామ రూరల్: అంటిండెట్ లేకుండా నడిపిస్తున్న దేవురుప్పుల మండలంలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం స్కూల్ బస్సులను సీజ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి యాకన్న రాథోడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆర్‌టీఏ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షురాలు దాసగాని సుమ కీర్తన, ఆర్య, రాజేష్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకలు

జఫర్‌గఢ్: బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, విశ్రాంత ఐపీఎస్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ జన్మదిన వేడుకలను వంగాల కుమార్ ఆధ్వర్యాన మండల కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కోత్వాల కుమార్,ఎండీ నజీర్, మారపల్లి కరుణాకర్, బ్రహ్మం, సంతోష్, యాకయ్య, కృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



బచ్చన్నపేట: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి దాతలు సహకరించాలని మండలంలోని దబ్బగుంటపల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం అమీర్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు దాతల సహకారంతో డ్రెస్సులు, టై, బెల్టు, గుర్తింపు కార్డులు అందించామన్నారు. అలాగే పూర్వ విద్యార్థి రొండ్ల దినేష్ రూ. 20 వేల విలువైన మైక్‌సెట్‌ను పాఠశాలకు అందించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు గొట్టె కనుకయ్య, దీక్షిత, శ్రీవిద్య, మమత, బదిలీ అయిన టీచర్లు రత్నం, రఘుమూర్తి , రజిత, ప్రవీణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి



పాలకుర్తి టౌన్: నియోజకవర్గ కేంద్రంలోని పాలకుర్తితోపాటు తొర్రూరు బస్టాండ్లను సుందరీకరణగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కోరారు. ఈ మేరకు బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసి విజ్ఞాపన పత్రాన్ని అందజేశారు.

సన్మానం

పాలకుర్తి టౌన్: నవోదయ విద్యాయలయ సమితి హైదరాబాద్ రీజియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న తెలుగు అధ్యాపకుల శిక్షణా సదస్సులో పాలకుర్తి మండల కేంద్రానికి చెందిన సాహితీవేత్త, పూర్వ అధ్యాపకుడు డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, భోపాల్, బైపూర్‌రీజియన్‌కు చెందిన అధ్యాపకులు ఈ కార్యక్రమాంలో పాల్గొన్నారు.

30న కేజీకేఎస్ వార్షికోత్సవ సదస్సు

పాలకుర్తి టౌన్: ఈ నెల 30న జనగామలో నిర్వహించే కేజీకేఎస్ 67వ వార్షికోత్సవ సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కమ్మగాని నాగన్న గౌడ్ కోరారు. శనివారం మండలంలోని దర్దేపల్లి, మల్లంపల్లి కల్లుగీత కార్మిక కార్మికులకు కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కల్లుగీత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని అన్నారు. కొండయ్య, రవీందర్, పరశరాములు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై కళాజాతా



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

రఘునాథపల్లి: ప్రజాపాలన విజయోత్సవాలను పురస్కరించుకుని కలెక్టర్ ఆదేశాల మేరకు తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు శనివారం మండలంలోని గోవర్దనగిరి, కోమల్ల, కంచనపల్లి గ్రామ పంచాయతీల వద్ద ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై కళాజాతా నిర్వహించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత విద్యుత్, మహిళలకు వడ్డీలేని రుణాలు, రైతుల రుణమాఫీ, స్కిల్ డెవలప్‌మెంట్ పథకాలపై ఆటపాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాంస్కృతిక కళాకారులు జనగామ శంకర్, పినమల సాంబయ్య, గడిపె బాలయ్య, చిరంజీవి, శ్రీనివాసులు, విజయ, సంపత్‌కుమార్, రవి పాల్గొన్నారు.